క్లుప్తంగా

సచివాలయాల్లో ఆధార్ సేవలు



కపిలేశ్వరపురంలో ఆధార్ వివరాలను నవీకరిస్తున్న మల్లేశ్వరరావు

కపిలేశ్వరపురం: మండలంలోని కపిలేశ్వరపురం తదితర గ్రామాల్లో గురువారం ఆధార్ సేవలు అందించారు. సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు మల్లేశ్వరరావు, దొరబాబు కపిలేశ్వరపురం, నల్లూరు సచివాలయాల్లో ఆధార్ నవీకరణ సేవలందించారు. ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి పర్యవేక్షణలో నిర్వహించిన ఈ కేంద్రాల్లో వేలిముద్రలు, ఐరిష్, చిరునామా, ఫొటోలను నవీకరించారు.

పారదర్శకంగా భూ సర్వే



టేకిలో సిబ్బందికి సూచనలు చేస్తున్న తహసీల్దార్ సూర్యారావు

కపిలేశ్వరపురం: గ్రామాల్లో చేపట్టిన భూ సర్వేను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ కొమరం సూర్యారావు అన్నారు. టేకి సచివాలయంలో గురువారం భూసర్వే అధికారులు, ఉద్యోగులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ సూర్యారావు మాట్లాడుతూ వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు రక్షణ పథకం ద్వారా సాంకేతికపరమైన రక్షణ లభిస్తుందన్నారు. ప్రభుత్వం సర్వేను ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని, సంబంధిత ప్రభుత్వ శాఖల ఉద్యోగులు సమన్వయంతో కృషి చేయాలన్నారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రీసర్వే అధికారులు, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

ఓవర్‌హెడ్ ట్యాంక్ పనుల పరిశీలన



తోడుగుడ్లపాడులో వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జేఈ

కపిలేశ్వరపురం: మండలంలోని నాగుల చెరువు గ్రామ శివారు తోడుగుడ్లపాడులో జరుగుతున్న ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకు నిర్మాణ పనులను ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ భాగ్యరాజ్ గురువారం పరిశీలించారు. 20 వేల లీటర్ల నీటి సామర్థ్యం గల ట్యాంకును రూ.14.48 లక్షల జల్‌జీవన్ మిషన్ నిధులతో నిర్మిస్తున్నారు. త్వరితగతిన పనులను పూర్తి చేసి వినియోగంలోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నట్టు భాగ్యరాజ్ తెలిపారు. ఆయన వెంట సచివాలయ మండల ఇంజినీరింగ్ సహాయకుడు పిల్లి శ్రీనివాస్ ఉన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

కాజులూరు: వార్షిక మరమ్మతుల కారణంగా గొల్లపాలెం 333/11 కేవీ విద్యుత్ స్టేషన్ పరిధిలోని కాజులూరు, కరప, తాళ్లరేవు మండలాల్లో పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్ కాకినాడ డీఈ జి.ప్రసాద్ గురువారం తెలిపారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ కరెంట్‌ను నిలిపివేయనున్నామని, ప్రజలు గమనించాలని కోరారు.

రాయవరం: మండలంలోని చెల్లూరు 33/11 కేవీఏ సబ్ స్టేషన్ నిర్వహణ, విద్యుత్ లైన్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు పనుల కోసం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుంది. ఈ విషయాన్ని రామచంద్రపురం ఈపీడీపీసీఎల్ ఈఈ వై.విజయానంద్ గురువారం విలేకరులకు తెలిపారు. ఈ కారణంగా మాచవరం, చెల్లూరు, అచ్యుతాపురం రోడ్డు పరిధిలోని వినియోగదారులకు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

వైభవంగా గంధోత్సవం



వెలంపాలెంలో జెండా ఊరేగింపు

రామచంద్రపురం రూరల్: వెలంపాలెంలో షాబాజియా మసీదు ప్రెసిడెంట్ సయ్యద్ ఫాజిల్ ఆధ్వర్యంలో మహబూబ్ సుభాని జెండా గంధోత్సవం గురువారం వైభవంగా నిర్వహించారు. వెలంపాలెం, ద్రాక్షారామల్లో ఊరేగింపు నిర్వహించారు. మతాలకు అతీతంగా హిందూ, ముస్లింలు మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జెండా కమిటీ సభ్యులు నౌషాద్‌బాబు, బాబూలాల్, జమాల్ హుస్సేన్, ఖదార్ గౌస్, రిహాన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

రైతుకు దన్ను

- పారదర్శకంగా ఖరీఫ్ ధాన్యం కొనుగోలు
- గ్రామంలో ఒకే ఆర్బీకేలో ప్రక్రియ
- సాంకేతిక సమస్యలకు చెక్
- ఏ ఆయకట్టు ధాన్యమైనా ఒకే కేంద్రంలో నమోదు
- మిల్లర్ల ప్రమేయం లేకుండా కస్టోడియన్
- రెండు నియోజకవర్గాల్లో 121 కేంద్రాలు



వీఆర్వోలతో కలిసి అంగరలో గోనె సంచులను పరిశీలిస్తున్న కపిలేశ్వరపురం తహసీల్దార్ సూర్యారావు

కపిలేశ్వరపురం: వరి సాగు చివరిదశకు వచ్చింది. శ్రమ ఫలితం చేతికి దక్కే సమయం ఆసన్నమైంది. చేలో పంట కొనుగోలు బాధ్యతను ప్రభుత్వం చేపట్టింది. మిల్లర్ల ప్రమేయానికి చెక్ పెడుతూ నూతన కొనుగోలు నిబంధనలను రూపొందించింది. అందుకు వ్యవసాయ అనుబంధ శాఖలను సమన్వయం చేసింది. కొనుగోలు ప్రక్రియకు రైతుభరోసా కేంద్రాలను వారధిగా చేసింది. ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ తీరుపై ఈ కథనం.

గిట్టుబాటు ధర ఇలా..

పంట సాగు దశలో ఉండగానే ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధర ప్రకటించింది. ఎ–గ్రేడ్ రకం క్వింటా ధర రూ.2,203కు, సాధారణ రకం క్వింటా ధర రూ.2,183గా ప్రభుత్వం నిర్ణయించింది. సకాలంలో సాగునీటిని విడుదల చేసింది. విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచింది. గిట్టుబాటు ధరను సైతం గతంలోకంటే పెంచి అమలు చేస్తోంది. ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఏర్పాట్లు వ్యవసాయ, రెవెన్యూ శాఖల సమన్వయంతో చురుగ్గా సాగుతున్నాయి.

పారదర్శకతకు పెద్దపీట

పూర్తి పారదర్శకతతో ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేస్తోంది. జిల్లాలో 384 ఆర్బీకేలుండగా, 231 కేంద్రాల్లో తగిన ఏర్పాట్లు చేసి ధాన్యం కొనుగోలుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. వాటి పరిధిల్లో 2.20 లక్షల గోనె సంచులను సిద్ధం చేశారు. 993 మంది సిబ్బంది రైతులకు సేవలందించనున్నారు. గతంలో సాంకేతిక సమస్యలతో సతమతమైన అనుభవాలను అధికారులు సమీక్షించారు. రైతుల ప్రయోజనాల కోసం పెద్ద గ్రామానికి రెండు ఆర్బీకేలను ఏర్పాటు చేసినప్పటికీ, ధాన్యం కొనుగోలు ప్రక్రియను మాత్రం ఒకే కేంద్రంలో నమోదు చేస్తున్నారు. దీనివల్ల ఒకే గ్రామంలో వేర్వేరు ఆయకట్టుల్లోని ధాన్యాన్ని రెండు ఆర్బీకేల్లో నమోదు చేయాల్సిన అవసరం లేకుండా, రైతు ధాన్యమంతా ఒకే ఆర్బీకేలో కొనుగోలు ప్రక్రియను చేపడుతున్నారు. ధాన్యాన్ని మిల్లుకు తరలించే ప్రక్రియలో వాహనానికి జీపీఎస్ పరికరాన్ని అమర్చడాన్ని తప్పనిసరి చేశారు. దీంతో పూర్తి పారదర్శకతతో ధాన్యం కొనుగోలు సాగుతుందని అధికారులు చెబుతున్నారు.

క్షేత్ర స్థాయిలో కొనుగోలు కేంద్రాలిలా..

మండలం	సాగు విస్తీర్ణం	రైతులు	ఆర్బీకేలు
రామచంద్రపురం	18,806	9.737	21
కె.గంగవరం	15,633	8,700	22
కాజులూరు	19,382	17,200	22
మండపేట	16,985	11,042	22
రాయవరం	14,593	12,002	19
కపిలేశ్వరపురం	16,333	7,200	15
మొత్తం	101,732	65,881	121

పారదర్శకంగా కొనుగోలు



ప్రభుత్వ ఆదేశాల మేరకు క్షేత్ర స్థాయిలో వ్యవసాయ, రెవెన్యూ అనుబంధ శాఖల సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేశాం. సంచులను సిద్ధం చేశాం. వాహనానికి జీపీఎస్ అమర్చడంతో కొనుగోలు పారదర్శకంగా సాగనుంది. ప్రస్తుత విధానం రైతులకు ప్రయోజనకరం.

– కొమరం సూర్యారావు, తహసీల్దార్, కపిలేశ్వరపురం

ఆర్డీవోగా సుధాసాగర్



రామచంద్రపురం: స్థానిక రెవెన్యూ డివిజినల్ అధికారిగా ఎస్.సుధాసాగర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కోనసీమ జిల్లా సివిల్ సప్లయి డీఎంగా పనిచేస్తున్న సుధాసాగర్‌ను రామచంద్రపురం రెవెన్యూ డివిజినల్ అధికారిగా బదిలీ చేశారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన పి.సింధూసుబ్రహ్మణ్యం బదిలీపై మార్కాపురం వెళ్లారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆర్డీవో సుధాసాగర్‌ను డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, ఇతర రెవెన్యూ అధికారులు ఘనంగా స్వాగతం పలికారు.

1న మండల పరిషత్ సమావేశం

కె.గంగవరం: నవంబర్ ఒకటో తేదీన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు ఈ సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల కృష్ణ హాజరుఅవుతారని ఆయన చెప్పారు. అన్ని శాఖల అధికారులు పూర్తి హాజరుకావాలన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- ద్వారపూడిలో గడప గడపకూ..



ద్వారపూడిలో మహిళకు బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలందరూ అండగా నిలవాలని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కోరారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ ఈతకోట కిన్నెర, ఉప సర్పంచ్ తులా శేషారావు ఆధ్వర్యంలో గురువారం ద్వారపూడిలో పర్యటించారు. ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ చిక్కాల శ్రీనివాసరావు, పార్టీ యువ నేత తోట పృథ్వీరాజ్ తదితరులతో కలిసి గ్రామంలోని వేములపల్లిలో ఇంటింటికీ వెళ్లి స్థానికులతో మమేకమయ్యారు. నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం ద్వారా ఆయా కుటుంబాల వారికి చేకూరిన లబ్ధిని వివరించారు. స్థానికులు తన దృష్టికి తీసుకు వచ్చిన సమస్యలపై ఎంపీడీఓ ఐ.రాజు, ఈఓ ఎ.రమణతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేశారు. అనంతరం ఎమ్మెల్సీ తోట మీడియాతో మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వంలో లేని విధంగా సీఎం జగన్ ప్రజల వద్దకే పథకాలను చేరవేస్తూ పారదర్శకమైన పాలన సాగిస్తున్నారన్నారు. టీడీపీ పాలనలో పనుల కోసం ప్రజలు టీడీపీ నాయకులు, కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదన్నారు. ముడుపులు చెల్లిస్తేనే కాని పథకాలు అందని దుస్థితి ఉండేదన్నారు. పేదల అభ్యున్నతి కోసం వచ్చే ఎన్నికల్లో మరలా జగన్‌ను సీఎం చేసుకోవాలని కోరారు. సొసైటీ చైర్మన్ తులా శ్రీరంగారావు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దంతులూరి శ్రీరామవర్మ, మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, మండల సేవాదళ్ కన్వనర్ పోతుల రాంబాబు, వార్డు సభ్యులు యరగతపు విజయ్, సంగిశెట్టి రమేష్, పార్టీ నాయకులు సత్తి సత్తిబాబు, పోతుల దుర్గాప్రసాద్, పాలినాటి సత్యనారాయణ, దండుబోయిన సూర్యనారాయణమూర్తి, నామాల వెంకన్న, పుట్టపూడి సత్తిబాబు పాల్గొన్నారు.

ప్రాధాన్యతా క్రమంలో గ్రామాల అభివృద్ధి

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- వెదురుమూడిలో సచివాలయ భవనం ప్రారంభం



వెదురుమూడిలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ తోట, సర్పంచ్ రామలక్ష్మి

కపిలేశ్వరపురం: మండలంలోని గ్రామాలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి చేస్తున్నట్టు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. వెదురుమూడిలో రూ.40 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన సచివాలయ భవనాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. సర్పంచ్ చోడే రామతులసి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పుట్టపూడి అబ్బు, వైస్ ఎంపీపీ గుణ్ణం భానుప్రసాద్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు రెడ్డి రాధాకృష్ణ, మండల సాగు సలహా మండలి చైర్మన్ పుట్టా కృష్ణమూర్తి హాజరయ్యారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి సచివాలయాలు కేంద్రాలుగా మారడం సామాన్యులకు సౌకర్యవంతమైందన్నారు. ఈ వ్యవస్థ మొత్తం భారతదేశాన్ని ఆలోచింపజేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, కార్యదర్శి వెలగల లక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు చోడే సూరిబాబు, నక్కా సింహాచలం, చోడే వెంకటేష్, మెర్ల రామకృష్ణ, గుత్తుల పుష్పాలరావు, గజ్జెరపు కల్యాణ్ కుమార్, ఆచంట సూర్యకుమార్, బెల్లం సత్యనారాయణ పాల్గొన్నారు.

విద్యతోనే మహిళాభ్యున్నతి

- పలు అంశాలపై కిశోర బాలికలకు అవగాహన
- వెలగతోడులో ర్యాలీ



వెలగతోడు ర్యాలీలో బాలికలు, అంగనవాడీ కార్యకర్తలు

మండపేట: విద్యతోనే మహిళల అభ్యున్నతి సాధ్యమని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను బాలికలు సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యావంతులుగా ఎదగాలని వెలగతోడు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం కె.సత్యనారాయణ అన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం వెలగతోడు జెడ్పీ ఉన్నత పాఠశాలలోని కిశోర బాలికలకు పలు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రోత్సాహంతో నేడు మహిళలు అన్ని రంగాల్లోనూ పురుషులతో సమానంగా రాణిస్తున్నారన్నారు. బాలికలపై వేధింపులు, అపహరణ, బాల్య వివాహాలు, మహిళల రక్షణ కోసం ప్రభుత్వం తెచ్చిన చట్టాల గురించి అంగనవాడీ సూపర్‌వైజర్ జి నాగసత్యవేణి అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అంగనవాడీ కార్యకర్తలు శివకుమారి, ఆమని, విజయలక్ష్మి, అనంతలక్ష్మి, మహిళ పోలీస్ గాయత్రి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

రాయవరం: యుక్త వయసు రాకుండానే వివాహాలు చేయడం వలన పలు అనర్థాలు ఏర్పడుతున్నాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రామాంజలి అన్నారు. బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలపై పసలపూడి జెడ్పీ ఉన్నత పాఠశాల్లో గురువారం విద్యార్థినులకు అవగాహన సమావేశం నిర్వహించారు. సర్పంచ్ కడలి పద్మావతి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రామాంజలి మాట్లాడారు. బాల్య వివాహాల నిరోధక చట్టాలను వివరించారు. విద్యార్థినుల్లో రక్తహీనత ఏర్పడకుండా ప్రభుత్వం పాఠశాలల్లో పౌష్టికాహారాన్ని అమలు చేస్తోందన్నారు. సమావేశంలో జీఎంఎస్‌కేలు పి.సౌజన్య, సౌజన్య ప్రియాంక, వైద్య ఆరోగ్య శాఖ తరపున ఎంఎల్‌హెచ్‌పీ డి.రెచల్, ఏఎన్‌ఎంలు జి.ఇంద్రజ, ఐ.బాలశ్యామసుధ, ఆశ వర్కర్లు ఆయా శాఖల తరపున విద్యార్థినులకు అమలు చేస్తున్న సౌకర్యాలను వివరించారు.

పేదల ఆరోగ్యానికి మరింత భరోసా



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ నాగమణి



లొల్ల శిబిరంలో మందులు అందజేస్తున్న పృథ్వీరాజ్, శ్రీనివాసరావు, వెంకటరమణ తదితరులు

కె.గంగవరం: ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఫ్యామిలీ డాక్టర్ అనుసంధానంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. మసకపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో ప్రజలకు పరీక్షలు చేసి మందులు అందజేశారు. ఎంపీపీ నాగమణి మాట్లాడుతూ ప్రభుత్వం ఆరోగ్యానికి పెద్ద పీటవేసిందన్నారు. ప్రతి ఒక్కరూ సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ పిల్లి అన్నపూర్ణ కళ్యాణ్, పంచాయితీ కార్యదర్శి రామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు రవ్వా భూషణం తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

కాజులూరు: రాష్ట్రంలో పేదల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గుబ్బల ఏసురాజు అన్నారు. గురువారం శలపాకలో గ్రామ సర్పంచ్ పోతుల గనిరాజు అధ్యక్షతన అధికారులు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసురాజు మాట్లాడుతూ సీఎం జగనన్న పేద, మధ్య తరగతి ప్రజలకు అనేక సంక్షేమ కార్యక్రమాలతోపాటు వారి ఆరోగ్య పరిరక్షణకు పలు పథకాలను రూపొందించారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా నిపుణులైన వైద్యులతో అందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి చికిత్స అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దడాల రమేష్, మాత మురళి, స్థానిక నాయకులు నున్న లక్ష్మణరావు, పొట్లకాయల నాగేశ్వర్రావు, పులగల సత్తిబాబు, వైద్య సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

లొల్లలో 341 మందికి వైద్యం

రాయవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష ప్రతి కుటుంబానికీ రక్ష అని వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్, మండపేట మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణ అన్నారు. మండలంలోని లొల్ల గ్రామంలో సర్పంచ్ చాట్రాతి జానకి రాంబాబు ఆధ్వర్యంలో గురువారం సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న పృథ్వీరాజ్, శ్రీనివాసరావు, వెంకటరమణ మాట్లాడుతూ పేదల ఆరోగ్యానికి సీఎం జగన్ రక్షగా నిలిచారన్నారు. శిబిరంలో గ్రామానికి చెందిన 341 మందికి వైద్య సేవలందించారు. గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ చేవా సత్యనారాయణ, ఉప సర్పంచ్ వెలంపాలెపు వెంకన్న, ఎంపీటీసీ వైట్ల సతీష్, వైఎస్సార్ సీపీ నేత నల్లమిల్లి వెంకటరెడ్డి, ఎంపీడీవో కె.నరేంద్ర రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఎం.భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.







సంక్షేమ సారథికి స్వాగతం

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగం రీజినల్ కో–ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ వివాహ రిసెప్షన్ గురువారం దివాన్ చెరువు సమీపంలోని డీబీవీ రాజు లేఅవుట్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకకు హాజరైన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి రాష్ట్ర సమాచార, బీసీ సంక్షేమం, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాస్‌చంద్రబోస్, ఎమ్మెల్యే తోట త్రిమూర్తులు ఆత్మీయ స్వాగతం పలికారు

భీమేశ్వరాలయంలో పూర్ణాహుతి



ద్రాక్షారామ భీమేశ్వరాలయ హోమశాలలో పూర్ణాహుతి

రామచంద్రపురం రూరల్: శరన్నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా ముగింపును పురస్కరించుకుని ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో గురువారం ఉదయం ప్రత్యేక పూజలు, హోమాలు చేశారు. అనంతరం వేద పండితుల వేదమంత్రోచ్చారణల నడుమ అర్చకులు, ఆలయ వైదిక బృందం నేతృత్వంలో మహా పూర్ణాహుతి నిర్వహించారు. అన్న సమారాధన జరిగింది. ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు, వరలక్ష్మి దంపతులు, దాతలు సత్తి సుబ్బారెడ్డి, సత్తి సత్తిరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

రేపు భీమేశ్వరాలయం మూసివేత

రామచంద్రపురం రూరల్: ఈ నెల 28 న రాహుగ్రస్త చంద్ర గ్రహణం కారణంగా మాణిక్యాంబ సమేత భీమేశ్వరాలయం మూసివేయనున్నట్టు ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం 4 గంటలకు ఆలయం మూసివేసి తిరిగి ఆదివారం ఉదయం 7 గంటలకు సంప్రోక్షణ అనంతరం తెరవనున్నట్టు తెలిపారు. భక్తులు గమనించాలని కోరారు.

నేడు వెలంపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష

రామచంద్రపురం రూరల్: వెలంపాలెంలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు గ్రామ సర్పంచ్, ఏపీఈడబ్ల్యూడీసీ డైరెక్టర్ టేకుమూడి సుజాత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాప్రతనిధులు, అధికారులు పాల్గొనాలని కోరారు. గ్రామ ప్రజలు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రైవేట్ స్కూల్ భాగస్వాముల మధ్య వివాదం

- తెరుచుకోని పాఠశాల
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు

మండపేట: పట్టణ శివార్లలోని ప్రైవేట్ స్కూల్ యాజమాన్య హక్కుపై భాగస్వాముల మధ్య తలెత్తిన వివాదం చర్చనీయాంశంగా మారింది. దసరా సెలవులు ముగిసినా వివాదం నేపథ్యంలో రెండు రోజులుగా పాఠశాల తెరుచుకోకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. మారేడుబాక సమీపంలో రెండున్నర దశాబ్దాల క్రితం ఇరువురు వ్యక్తులు నెలకొల్పిన ప్రైవేట్ స్కూల్ మండపేట, పరిసర గ్రామాల్లో మంచి గుర్తింపు పొందింది. ఎల్‌కేజీ నుంచి ఇంటర్ వరకు గల ఈ విద్యాసంస్థలో దాదాపు 1400 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. కొన్నేళ్ల క్రితం ఒక భాగస్వామి మృతి చెందగా ఆయన భార్య పాఠశాల నిర్వహణలో భాగస్వామి అయ్యారు. కొంతకాలం బాగానే నడిచినప్పటికీ ఆర్థిక లావాదేవీల విషయమై విభేదాలు తలెత్తాయి. ఇరువర్గాల వారు పెద్దల సమక్షంలో పరిష్కరించేందుకు ప్రయత్నించిన సయోధ్య కుదరలేదు. వివాదం ముదరడంతో తమకు హక్కు ఉందని మృతి చెందిన భాగస్వామి భార్య పాఠశాల వద్ద తన వర్గీయులతో కలిసి ఆందోళనకు దిగారు. దీంతో ఇరువర్గాల వారు పోలీసులకు పరస్పర ఫిర్యాదులు చేసుకున్నారు. ఈ క్రమంలో రెండు రోజులుగా పాఠశాల తెరుచుకోకపోవడంతో విద్యార్థుల భవిష్యత్తుపై తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.

అప్పనపల్లి బాలాజీ సన్నిధిలో ఆర్డీఓ

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారిని అమలాపురం ఆర్డీఓ కేశవర్ధనరెడ్డి గురువారం దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువు తీరిన బాలబాలాజీని దర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు అర్చకులు స్వామి వారి శేషవస్త్రాన్ని బహూకరించి, ఆశీర్వచనాలు అందించారు.

పంట నమోదు జాబితాల ప్రదర్శన



తర్లంపూడిలో రైతుల జాబితాలను ప్రదర్శిస్తున్న మండల వ్యవసాయాధికారి అశోక్

కాజులూరు: ఈ ఖరీఫ్ పంటకు సంబంధించి పంట నమోదు జాబితాను స్థానిక ఆర్బీకేల్లో గురువారం ప్రచురించినట్టు మండల వ్యవసాయాధికారి వి.అశోక్ తెలిపారు. ఈ జాబితాలపై అభ్యంతరాలుంటే చెప్పాలని ఆయన రైతులను కోరారు. ఇటీవల తమ సిబ్బంది మండలంలో మొత్తం 18340 ఎకరాలలో 14835 మంది రైతులకు క్రాఫ్ బుకింగ్, ఈకేవైసీ తీసుకున్నారన్నారు.

రాయవరం: సామాజిక తనిఖీ నిమిత్తం పంట నమోదు జాబితాలను గురువారం రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించారు. ఏవో కొప్పిశెట్టి ప్రభాకర్ ఆధ్వర్యంలో మండలంలోని 19 రైతు భరోసా కేంద్రాల్లో వాటిని అందుబాటులో ఉంచారు. సోమేశ్వరంలో జాబితాను ప్రదర్శించిన అనంతరం ఏవో కొప్పిశెట్టి ప్రభాకర్ మాట్లాడుతూ పంట నమోదు జాబితాలపై ఎలాంటి అభ్యంతరాలున్నా ఈ నెల 29లోగా సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లో తెలపవచ్చన్నారు. 30వ తేదీ తర్వాత ఎటువంటి మార్పులు చేయడానికి వీలు లేదన్నారు. అనంతరం తుది జాబితా వెలువడుతుందన్నారు. సొసైటీ అధ్యక్షుడు నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నాగదేవర తాతాజీ, సలహా మండలి సభ్యులు శాఖ శ్రీను, గరగ కామరాజు, పీఏసీఎస్ సీఈవో రాజశేఖర్ పాల్గొన్నారు.

రామచంద్రపురం రూరల్: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద పంట నమోదు జాబితాలను ప్రదర్శనలో ఉంచినట్టు మండల వ్యవసాయ అధికారి ఎన్. సత్యప్రసాద్ గురువారం విలేకరులకు తెలిపారు. మండలంలో ఈ క్రాప్ బుకింగ్ 18,305 ఎకరాలకు 12,881 మంది రైతులకు పూర్తయిందన్నారు. సామాజిక తనిఖీ నిమిత్తం ఆ జాబితాలను ఆర్బీకేల్లో ప్రదర్శనకు పెట్టామని, జాబితాల్లో ఏమైనా తేడాలుంటే గ్రామ సభల ద్వారా సరిచేస్తామన్నారు.